సాక్షి
ఒడిశా
ఆదివారం। 20। ఏప్రిల్। 2025




40 యూనిట్ల రక్తం సేకరణ

పర్లాకిమిడిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 యూనిట్ల రక్తం సేకరించారు.
- 4లో



పేపర్ మిల్లులో ఆకలి కేకలు

గగనాపూర్ పేపర్ మిల్లులో ఆకలికేకలు వినిపిస్తున్నాయి. కార్మికులు ఆందోళన చేస్తున్నారు.
- 4లో



విద్యుత్ అందక..

విద్యుత్ అందక హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఆగిపోయింది. ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.
- 4లో

న్యూస్‌రీల్

మావోల డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న తుపాకులతో కలిమెల పోలీస్ స్టేషన్ వద్ద జవాన్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి పిలిమామ్మిడి గ్రామ అడవిలో శుక్రవారం రాత్రి నుంచి రెండో బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవాన్లు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. శనివారం తిరిగి వస్తున్న సమయంలో ఓ కొండపై రాయి మధ్యన ఓ నల్లని క్యారీ బ్యాగ్‌లో జవాన్లను టార్గెట్ చేస్తూ ఉంచి మావోల సామగ్రి జవాన్ల కంట పడింది. అందులో రెండు బర్మన్ తుపాకులు, గన్ పౌడర్ తదితర వస్తువులు గుర్తించారు.

చోరీ సొత్తు స్వాధీనం



రికవరీ చేసుకున్న వస్తువులు

కొరాపుట్: ఒక చోరీ కేసులో సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సిమిలిగుడ పోలీసులు ప్రకటించారు. శనివారం సిమిలిగుడ ఇన్‌చార్జి ఐఐసీ అనితా కుజుర్ కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం సిమిలిగుడ పోలీసుస్టేషన్ పరిధి కైలాష్ నగర్ 10వ లైన్‌లో నివసిస్తున్న ప్రబీర్ కుమార్ దాస్ ఒక శుభకార్యానికి సునాబెడా వెళ్లారు. అయితే రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడినట్లు గమనించారు. వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో జయపూర్ సదర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోరీకి గురైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రూ.22,500ల నగదు, వెండి వస్తువులు, స్టేషనరీ సామాన్లు ఉన్నాయని ప్రకటించారు.

300 కేజీల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, గంజాయి

కొరాపుట్: అక్రమంగా రవాణా చేస్తున్న 300 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీసులకు గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు శనివారం సమాచారం వచ్చింది. దీంతో పెట్రోలింగ్ చేపట్టారు. దీనిలో భాగంగా హికింపుట్ గ్రామం వద్ద నిలుపుదల చేసిన ఒక కారుని పరిశీలించారు. అందులో భారీగా గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కారు యజమాని కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కారు పాడువా నుంచి సిమిలిగుడ వైపు వస్తున్నట్లు పేర్కొన్నారు.

విజిలెన్స్ వలలో అడిషనల్ తహసీల్దార్



సంబల్‌పూర్ విజిలెన్స్ అధికారులకు చిక్కిన అడిషనల్ తహసీల్దార్ భుబనా నంద సాహు

కొరాపుట్: విజిలెన్స్ వలలో అడిషనల్ తహసీల్దార్ పడ్డా. శనివారం సంబల్‌పూర్ జిల్లా మానేశ్వర్ తహసీల్ కార్యాలయంలో అదనపు తహసీల్దార్‌గా పనిచేస్తున్న భుబనా నంద సాహు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు. వ్యవసాయ భూమిని గృహ నిర్మాణ భూమిగా మార్చడానికి రూ.10వేలు లంచం డిమాండ్ చేయగా.. బాధితుడు విజిలెన్స్ వారిని సంప్రదించగా వారు మాటు వేసి పట్టుకున్నారు.

గ్రామస్తుల చేతికి చిక్కిన దొంగ



గ్రామస్తులకు చిక్కిన దొంగ

కొరాపుట్: దొంగతనం చేయడానికి వెళ్లి గ్రామస్తుల చేతికి చిక్కిన ఓ దొంగ దొరికిపోయాడు. శనివారం వేకువ జామున కొరాపుట్ జిల్లా కేంద్రానికి సమీపంలో మస్తీపుట్ గ్రామ పంచాయితీ రుండియా గ్రామంలోనికి ముగ్గురు దొంగలు ప్రవేశించారు. ఒక దుకాణంలో దొంగతనం చేస్తున్నారు. ఇదే సమయంలో గ్రామ యువకులు కొరాపుట్ పట్టణం నుంచి తిరిగి వచ్చారు. దొంగలు పడినట్లు గుర్తించి వారిపై దాడి చేశారు. ఇద్దరు పారిపోగా.. ఒకడిని పోలీసులకు అప్పగించారు.

నవీన్‌కు 9వ సారి పట్టాభిషేకం

- బీజేడీ అధ్యక్షుడిగా మళ్లీ నవీన్ నియామకం
- సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారిగా కళకళలాడిన శంఖ్ భవన్
- రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన ముఖ్య నాయకులు



నవీన్‌ని అభినందిస్తున్న పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ దేవి మిశ్ర తదితరులు



నవీన్‌తో బీజేడీ రాష్ట్ర మహిళా నేతలు

కొరాపుట్: సార్వత్రిక ఎన్నికల తర్వాత వెలవెలబోయిన బీజేడీ పార్టీ రాష్ట్ర కార్యాలయం తొలిసారిగా కళకళలాడింది. శనివారం పార్టీ అధ్యక్షునిగా నవీన్ పట్నాయక్ 9వ సారి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంపై ముందుగా సమాచారం రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ ప్రెసిడెంట్‌లు, జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు ముందే తరలి వచ్చారు.

దద్దరిల్లిన శంఖ్ భవన్..

పార్టీ బాధ్యతలు స్వీకరించడానికి నవీన్ కారులో శంఖ్ భవన్ చేరుతున్నప్పుడు కార్యకర్తల నినాదాలతో శంఖ్ భవన్ దద్దరిల్లింది. పార్టీ ముఖ్య నేతలు వరుస క్రమంలో నించుని అధినేతకి స్వాగతం పలికారు. సమావేశ మందిరంలో ప్రేక్షకులు గ్యాలరీలో ముందు వరుసలో నవీన్ కూర్చున్నారు. పార్టీ ఎన్నికల రాష్ట్ర రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ప్రతాప్ కేసరి దేవ్ తొలుత ప్రసంగించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి నవీన్ ఒక్కరే నామినేషన్ వేసినందున అధ్యక్షునిగా ప్రకటిస్తున్నానని చెప్పారు. వెంటనే శంఖ్ భవన్ చప్పట్లతో దద్దరిల్లింది. ప్రతాప్ కేసరి నవీన్ వద్దకు వచ్చి వేదిక మీదకు తీసుకొని వెళ్లారు.

బిజూ ఆశయాలలో నడుస్తాం

తమ నాయకుడు దివంగత బిజూ పట్నాయక్ ఆశయాలలో తమంతా నడుస్తామని నవీన్ ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్ష పదవి స్వీకరించిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 2000–24 వరకు ప్రజలు ఇచ్చిన అవకాశంతో బీజేడీ పార్టీ ఒడిశా రాష్ట్రానికి చేసిన సేవ చరిత్రాత్మకం అని అన్నారు. ప్రస్తుతం కార్యకర్తలు పార్టీ ఉన్నతి కోసం పని చేయాలన్నారు. ప్రజల లోనికి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేవలం కొద్ది ఓట్ల తేడాతో అనేక సీట్లు కోల్పోవడం ద్వారా అధికారం కోల్పోయామన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజా సేవ చేయాలని విజ్ఞప్తి చేశారు. మనపై దుష్ప్రచారాలు చేయడం తప్ప, ప్రత్యర్థులకు మరేం పని లేదన్నారు.

అభినందనలు

వేదిక మీద ఉన్న నవీన్‌కి రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పూలగుచ్ఛాలు, శాలువాలతో అభినందించారు. చాలా కాలం తర్వాత నాయకులు ఒకరినొకరు ఎదురు పడడంతో పలకరింపులతో ఆ ప్రాంతం కళకళ లాడింది. మహిళా నాయకులు ప్రత్యేకంగా నవీన్‌తో ఫొటోలు దిగారు.



ప్రసంగిస్తున్న నవీన్ పట్నాయక్



నవీన్‌ని అభినందిస్తున్న ప్రతిప్ మజ్జి, సదాశివ ప్రదాని, తపస్ ప్రహరి



కార్యక్రమానికి హాజరైన బీజేడీ శ్రేణులు



నవీన్‌తో బబిదాస్ తదితర ముఖ్య బీజేడీ నాయకులు



అధ్యక్ష ఎన్నిక ఫలితం ప్రకటన ముందు ప్రేక్షకులతో కూర్చున్న నవీన్

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



రాకేష్ ఒటక (ఫైల్)

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. మృతుడిని జిల్లాలోని కొలనార పంచాయితీలోని కెవుటిగుడ గ్రామానికి చెందిన రాకేష్ ఒటక (19) గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న రాకేష్ బైకుపై వ్యక్తి గత పనుల కోసం కెవుటిగుడ నుంచి జేకే పూర్‌కు శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. ఒంటామడ వద్ద గల పార్వతీనగర్ ప్రాంతంలో గుర్తు తెలియని ఒక వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురై రాకేష్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.

నిలిచిపోయిన రైళ్లు



నిలిచిన గూడ్స్ రైలు



తెగిపడిన విద్యుత్ వైర్లు

కొరాపుట్: కొత్తవలస – కిరండోల్ రైల్వేమార్గంలో కొరాపుట్–జయపూర్ రైల్వేస్టేషన్ల మధ్య జరతి రైల్వేస్టేషన్‌లో ప్రమాదం జరగడంతో రైళ్లు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. గంగవరం పోర్టు నుంచి గూడ్స్ రైలు ఛత్తీష్‌గఢ్‌లోని బచేలి నుంచి ముడి ఇనుప రజను తీసుకొని రావడానికి వెళ్తోంది. అయితే ఆ సమయంలో గుర్తు తెలియని వస్తువు ఢీకొనడంతో ఒక విద్యుత్ స్తంభం ముందుకు కదిలింది. దీంతో 350 మీటర్ల విద్యుత్ వైరు తెగిపడింది. ఫలితంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైళ్లు నిలిచిపోయాయి. వెంటనే కొరాపుట్, జయపూర్ స్టేషన్ల నుంచి రైల్వే నిపుణులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ పునరుద్ధరించారు. దీంతో జగదల్‌పూర్–రౌర్కెలా, జగదల్‌పూర్–భువనేశ్వర్ రైళ్లని జయపూర్ రైల్వేస్టేషన్లో నిలిపివేశారు.

గాయపడిన సర్పాలకు రక్షణ



గాయపడిన కోబ్రా పాములు



పాముకి మెడ మీద గాయం



మరో పాముకి నడుం మీద గాయం

కొరాపుట్: గాయాలపాలైన భయంకరమైన కోబ్రా పాములను స్నేక్ హెల్పర్లు రక్షించారు. శనివారం కొరాపుట్ జిల్లా జయపూర్ సమీపంలోని డొంగ్రురుచించి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిలుపదల చేసిన జేసీబీ వాహనంలో రెండు కోబ్రా పాములు బుసలు కొట్టడం స్థానికులు గమనించారు. వాటిని అదిలించడానికి ప్రయత్నం చేసినా పడగ ఎత్తుతూ బుసలు కొట్టాయి. జాగ్రత్తగా గమనిస్తే అవి యంత్రంలో చిక్కుకున్నాయని గమనించారు. వెంటనే జయపూర్ లో ఉన్న స్నేక్ హెల్పర్ కృష్ణ కేశవ షడంగి కి సమాచారం ఇచ్చారు. కేశవ తన టీమ్ సభ్యుడు చందన్ తో కలసి సంఘటన స్థలానికి చేరుకున్నాడు. నేర్పుగా వాటిని బయటకు తీయగా ఒక సర్పంకి మెడ మీద, మరోక దానికి నడుం మీద తీవ్ర గాయాలు అయినట్లు గుర్తించారు. వెంటనే వాటిని పశువైద్యాధికారి శౌభ్యాగ్య వద్ద చికిత్స చేయించారు. అనంతరం వాటిని జయపూర్ రేంజ్ అటవీ శాఖా అధికారి సచ్చి పరిడాకి అప్పగించారు. కేశవ్ బృందాన్ని అటవీ శాఖ అధికారులు అభినందించారు. వాటిని సురక్షితమైన ప్రదేశంలో ఉంచి కోలుకున్న తర్వాత అటవీ ప్రాంతంలో వదలి పెడతామని అటవీ శాఖ అధికారులు ప్రకటించారు.

నూతన భవనం ప్రారంభం



అదనపు భవనం ప్రారంభిస్తున్న కలెక్టర్ వి.కీర్తి వాసన్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలో మ్యూజియం సమీపంలో ఉన్న కౌన్సిల్ ఆఫ్ ఎనాలిటికల్ ట్రైబల్ స్టడీస్ (కోట్స్) ప్రాంగణంలో నూతన భవనాన్ని కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ ప్రారంభించారు. ఓఎంసీ కేటాయించిన రూ..8 లక్షలతో ఈ భవనం నిర్మితమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఘటనా స్థలంలో ధర్మేంద్ర మృతదేహం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి డెంగాగుడ-కలిమా గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో చికాంబర్ గ్రామానికి చెందిన ధర్మేంధ ముదలి (25) అనే యువకుడు మృతి చెందాడు. స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ, మలుపు దాటుతుండగా బైక్ అదుపు తప్పింది. దీంతో పక్కనే ఉన్నటువంటి గోతులోకి బైక్ దూసుకుపోవడంతో రాళ్లని ఢీకొని మృతి చెందాడు. దశమంత్‌పూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

రాయగడలో చోరీ

రాయగడ: పట్టణంలోని కరణం వీధిలో నివసిస్తున్న కె.సుభాష్ చంద్కర బెహర అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి బీరువా విరగ్గొట్టి రూ.2.50 లక్షల నగదును దోచుకెళ్లినట్లు బాధితుడు సదరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి ఇంట్లోని అందరూ నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో సుభాష్‌కు మెలకువ వచ్చి వాష్ రూమ్‌కి వెళ్లేందుకు చూశాడు. అయితే అప్పటికే ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అనంతరం ఇంట్లోని ఒక గదిలో ఉన్న బీరువా తలుపులు తెరిచి ఉండడం గమనించి అక్కడికి వెళ్లి చూడగా అందులోని నగదు కనిపించలేదు. దీంతో తెల్లవారు జామున పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి



మృతి చెందిన చిన్నారితో తల్లి కొనే సికక

రాయగడ: బ్యాంకుకు రెండు నెలల పసికందును మోసుకుంటూ వెళ్లిన ఆ మహిళ బ్యాంకు లావాదేవీల్లో ఉండగా అనుకోకుండా తీవ్ర అస్వస్థతకు గురైన ఆ చిన్నారి కన్నుమూసింది. ఈ ఘటన జిల్లాలోని కళ్యాణసింగుపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కళ్యాణసింగుపూర్ సమితి పర్శాలి పంచాయతీలోని ఫకేరి గ్రామంలో నివసిస్తున్న డొంగిరియా తెగలకు చెందిన 20 మంది మహిళలు తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించి లావాదేవీల కోసం కళ్యాణసింగుపూర్‌లో గల ఒక బ్యాంకుకు వెళ్లారు. తమ గ్రామం నుంచి ఎలాంటి రవాణా సౌకర్యాలు లేకపోవడంతో సుమారు 5 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ అంతా కలసి పర్శాలికి చేరుకుని అక్కడి నుంచి ఒక ఆటో సాయంతో కళ్యాణసింగుపూర్‌కు బయల్దేరారు. వీరితో పాటు కొనే సికక అనే మహిళ కూడా తన రెండు నెలల పసికందును వెంట తీసుకువెళ్లింది. ఈ క్రమంలో బ్యాంకుకు చేరే సరికి కొద్ది సమయం తర్వాత పసికందు ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. వెంటనే అక్కడ గల ఆస్పత్రికి తరలించగా అప్పటికే పసికందు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కన్నీరు మున్నీరైన ఆమె మృతదేహాన్ని తమ గ్రామానికి తీసుకువెళ్లింది.

కాలవైశాఖి విజృంభణ



బలంగీర్ జిల్లాలో కూలిన చెట్టు



కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ సమీపంలో ఎక్కంబ వద్ద ఇంటిపై కూలిన చెట్టు

కొరాపుట్: రాష్ట్ర వ్యాప్తంగా కాల వైశాఖి నష్టాలు పెరిగాయి. శనివారం దాదాపు 10 జిల్లాలో విపరీతమైన గాలులు వీచాయి. భారీ వర్షాలు పడడంతో చెట్లు విరిగి పడ్డాయి. పూరీ సమీపంలో పిప్పిలిలో భారీ వర్షం పడింది. జాజ్‌పూర్ జిల్లాలో 60 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి. చెట్టు విరిగి పడడంతో బలంగీర్ జిల్లాలో 8 బైక్‌లు ధ్వంసమయ్యాయి. కెందుజోర్ జిల్లా వేడుకలకు నిర్మించిన భారీ టెంట్లు కూలిపోయాయి. నబరంగ్‌పూర్ జిల్లాలో భారత మాల రోడ్డు నిర్మాణ క్యాంపు షెడ్లు కూలిపోయాయి. ఈ పరిస్థితి ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది.

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మన్యంకొండ పంచాయతీ టాగరకోట గ్రామంలో ఓ రాతి పర్వతంపై పర్యాటక అభివృద్ధి కోసం నిర్మించిన 15 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం కాలవైశాఖి విజృంభణకు విరిగిపోయింది. ఈ విగ్రహాన్ని చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున వస్తున్నారు.



నబరంగ్‌పూర్ జిల్లా దాబుగాం వద్ద కూలిన భారత మాల షెడ్లు



కూలిన శివుని విగ్రహం

క్లుప్తంగా

ఆరో తరగతి బాలికకు గర్భం

రాయగడ: జిల్లాలోని కల్యాణసింగుపూర్‌లో ఆరో తరగతి చదువుతున్న బాలిక గర్భం దాల్చింది. ప్రేమ పేరుతో ఓ యువకుడు ఆమెను మోసగించాడు. ఇతడు ప్లస్ టూ చదువుతున్నాడు. బాలిక శరీరంలో మార్పులు గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయగా ఆమె గర్భం దాల్చినట్లు తేలింది. ఆమెను ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. దీంతో తల్లిదండ్రులు కల్యాణసింగుపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించారు.

సారాతో ఇద్దరు అరెస్టు


సారాతో పట్టుబడిన నిందితులు

జయపురం: సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు జయపురం అబ్కారి విభాగ అధికారి శుబ్రత్ కేశరి హిరన్ శనివారం తెలిపారు. అరెస్టు అయిన వారిలో ఒక మహిళ ఉందని వెల్లడించారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామని, బెయిలు మంజూరు కాకపోవటం వలన వారిని జైలుకు పంపామన్నారు. శుక్రవారం సాయంత్రం అబ్కారి సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుంగా నరసింహ, ఓ మహిళ జయనగర్ గ్రామం సమీపంలో సారా తీసుకువస్తుండగా పట్టుబడ్డారన్నారు. ఎ.ఎస్.ఐ బలరాం దాస్, అబ్కారి సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు


నిందితులను పట్టుకున్న దేవిగిరి అటవీ రేంజ్ అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి ఉప్పలాడ గ్రామం శబరనగర్ వద్ద నిషేధిత అటవి పందిని వేటాడి మాంసం అమ్ముతున్న సమాచారం అందుకున్న దేవగిరి రేంజ్, కోర్సండ్ బీట్ అటవీ అధికారులు ఇద్దరు వేటగాళ్లను పట్టుకుని శనివారం కోర్టుకు తరలించారు. ఇద్దరు నిందితులు ఇప్రియం శోబోరో, ఏసాకో భుయ్యాన్ వద్ద 8 కిలోల అడవి పంది మాంసం, ఒక మోటార్ సైకిల్, అయిదు కత్తులు, కీప్యాడ్ మొబైల్‌ను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వన్యమృగాల రక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు డీఎఫ్‌ఏ కె.నాగరాజు తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

అరసవల్లి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది శనివారం శాంతియుత నిరసన చేపట్టారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సంఘ జిల్లా అధ్యక్షురాలు ఉష ఆధ్వర్యంలో ఆరోగ్యమందిర్‌లో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న 573 మంది ఈ నిరసనలో పాల్గొన్నారు. నియామకాలు జరిగి ఆరేళ్లు గడుస్తున్నా తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇన్సెంటివ్‌తో పాటు ఏటా 5 శాతం ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పథకాల అమలుపై ఆరా


జీడి పరిశ్రమను పరిశీలిస్తున్న అధికారులు


స్ట్రా బెర్రీ పంట సాగు చేస్తున్న రైతుల సమస్యలను వింటున్న అధికారులు


సెమ్లాలో చేతి వృత్తుల కళాకృతులతో అధికారులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును రాష్ట్ర కల్చరల్ డైరెక్టర్, జిల్లా నోడల్ అధికారి బిజయ్ కేతన్ ఉపాధ్యాయ క్షేత్ర పరిశీలన చేశారు. శనివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ప్రతి ఏడాది జరిగే మండయ్ ఉత్సవాల గ్రౌండ్‌ను పరిశీలించారు. ఆ ప్రాంతంలో శాశ్వతంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. శాసన, అగ్నిపూర్ గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. మహుల్ పాదర్, సన్న మసిగాం జీడి పరిశ్రమ కేంద్రాల్లో పర్యటించారు. సన్న మసిగాం గ్రామంలో 20 మంది మహిళలకు ప్రభుత్వ ఆర్థిక సహాయం ద్వారా ఉపాధి పొందుతున్న చేనేత పరిశ్రమలో మహిళలతో మాట్లాడారు. తంగజారి, బాసిని గ్రామాల్లో ప్రభుత్వ సహాయంతో గిరిజనులు పండిస్తున్న స్ట్రాబెర్రీ ఉత్పత్తులను పరిశీలించారు. లిమబట్ట, కొకొడి సెమ్లా గ్రామాల్లో హస్త కళల ఉత్పత్తి కేంద్ర కళాకారులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయంపై ఆరా తీశారు. మిషన్ శక్తి వ్యవహారాలు, మెగా వాటర్ ప్లాంట్ నిర్మాణాలను జిల్లా వ్యాప్తంగా పరిశీలించారు. ఈ పర్యటనలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, అన్ని శాఖలు అధికారులు పాల్గొన్నారు.


చేనేత కళాకారులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి బిజయ్ కేతన్

విద్యుత్ అందక నిలిచిపోయిన హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్


రౌలి స్టేషన్ వద్ద నిలిచిపోయిన హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్

రాయగడ: భువనేశ్వర్ నుంచి జగదల్‌పూర్‌కు వెళుతున్న ఇంటర్‌సిటీ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు విద్యుత్ సరఫరా అందకపోవడంతో కొరాపుట్–రాయగడ రైలు లైనులో గల లెల్లిగుమ్మ–రౌలి స్టేషన్ల మధ్య ఆపేశారు. సుమారు మూడు గంటల పాటుగా రైలు నిలిచిపోవడంతొ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యుత్‌సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశారు.

ఘాట్ రోడ్డులో జారిపడిన భారీ యంత్రం


రోడ్డుకి మధ్యలో పడిన భారీ యంత్రం


పక్కకు వరిగిపోయిన భారీ ట్రాలీ


అప్రమత్తంగా దాటుతున్న వాహనాలు

కొరాపుట్: కొరాపుట్–జయపూర్ పట్టణాల మధ్య జాతీయ రహదారి–26పై భారీ యంత్రం జారి పడింది. శనివారం వేకువ జామున దేవఘాట్ వద్ద కొరాపుట్ నుంచి వస్తున్న భారీ ట్రాలీ మలుపు వద్ద అదుపు తప్పింది. వేగంతో పక్కకు ఒరిగిపోయింది. దానిపై ఉన్న భారీ యంత్రం రోడ్డు మధ్యన పడింది. ఘటన జరిగి 14 గంటలైనా అధికారుల నుంచి స్పందన లేదు. రోడ్డుపై ఉన్న యంత్రాన్ని ఏదైనా వాహనం ఢీకొడితే మరో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినప్పటికీ దీనిని తొలగించడం గానీ, ప్రమాద హెచ్చరిక గానీ లేకపోవడంతో వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో నిత్యం భారీ వాహనాలు తిరుగుతుంటాయి. యంత్రాన్ని తొలగించే లోపు వర్షం పడినా, చికటి పడినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

రైలు నుంచి జారిపడి వలస కార్మికుడి మృతి


కునుగౌడ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఇచ్ఛాపూర్ పంచాయతీలోని కాసెర గ్రామానికి చెందిన కును గౌడ (17) అనే యువకుడు ప్రమాదవసాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. గత కొద్ది నెలల క్రితం కును తన స్నేహితులతో కలిసి ఉపాధి కోసం కేరళకు వెళ్లాడు. పనులు ముగించుకుని శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేందుకు ట్రెన్‌లో బయలు దేరాడు. తిరుచూర్–పాలకాడ్ రైలులో డోర్ వద్ద నిలబడి ఉండటంతో ప్రమాదవసాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు.. ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. అక్కడ నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు అవసరమయ్యే డబ్బులు లేకపొవడంతో జిల్లా కార్మిక శాఖ అధికారులకు కును తల్లిదండ్రులు ఆశ్రయించారు. దీనిపై స్పందించిన అధికారులు అవసరమయ్యే ఖర్చులు భరించి మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు హామీ ఇచ్చారు.

విద్వేషాలు రెచ్చగొట్టడం తగదు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ధ్వజమెత్తారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. దీనిని ఎదురిస్తున్న కాంగ్రెస్ నాయకులను మట్టు పెట్టాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తులు మీద, పార్టీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేయడం విడ్డూరమన్నారు. ఇలాంటి చర్యలకు భయపడేది లేదన్నారు. బీజేపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

పేపర్ మిల్లులో ఆకలి కేకలు


బిల్ట్ పేపర్ మిల్లులో ఉద్యోగులతో చర్చలు జరుపుతున్న యాజమాన్య ప్రతినిధులు

కొరాపుట్: జయపూర్ పట్టణ సమీపంలో గగనాపుర్ లో గల బిల్ట్ పేపర్ మిల్లులో ఉద్యోగులు ఆకలి కేకలు పెట్టారు. శనివారం యాజమాన్య కార్యాలయం ముందు ఆందోళన చేశారు. గత 8 నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో పిల్లలు చదువులు, కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులపై ఆవేదన వ్యక్తం చేశారు.

40 యూనిట్ల రక్తం సేకరణ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ జితేంద్రనాథ్ పండా


సెయింట్ జోసెఫ్ కాథలిక్ చర్చిలో రక్తదాన శిబిరంలో డాక్టర్ షబ్నా పర్వీన్


ఈస్టర్ పండుగ సందర్భంగా పాటలు పాడుతున్న క్రైస్తవులు

పర్లాకిమిడి: స్థానిక డోలాట్యాంకు రోడ్డు సెయింట్ జోసెఫ్ కాథలిక్ చర్చిలో గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం రక్తదానం శిబిరంను ఫాదర్ అజిత్ కుమార్ నాయక్ ఏర్పాటుచేశారు. ఈ శిబిరానికి ఎస్పీ జితేంద్రనాథ్ పండా ప్రారంభించగా, జిల్లా ప్రజారోగ్య అధికారి డాక్టర్ రబినారాయణ దాస్, డాక్టర్ షబ్నా పర్వీన్, సీనియర్ ఫార్మసిస్టు ఖగేశ్వర బెహరా, పింకి పాఢి, జి.ప్రవీన్ సహకరించారు. పలువురు క్రైస్తవ సోదరులు స్వచ్ఛందంగా పాల్గొని మొత్తం 40 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు తరలించారు.

క్రికెట్ విజేత కలహండి


విజేతగా నిలిచిన కలహండి -11 జట్టు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ స్వాతి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని దొరగుడ వద్ద గల ఉత్కళ అల్యూమినియం ఇంటర్ నేషనల్ కర్మాగారం ఆధ్వర్యంలో ఉషాపడు టౌన్ షిప్ మైదానంలో శనివారం స్టేక్ హోల్డర్ ఫ్రెండ్ షిప్ ఒక్కరోజు క్రికెట్ టోర్నమెంటు జరిగింది. జిల్లా ఎస్పీ స్వాతి ముఖ్యఅతిథిగా, జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్, ఏఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రోలు గౌర అతిథులుగా హాజరయ్యారు. 5 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు మ్యాచ్ కలహండి -11, రాయగడ -11 కలెక్టర్ కార్యాలయ సిబ్బంది జట్లు చేరుకున్నాయి. ఫైనల్‌లో కలహండి-11 జట్టు విజేతగా నిలిచింది. కర్మాగారం యూనిట్ హెడ్ మజూర్ బేగ్, జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ అలీనూర్, కలహండి జిల్లా క్రీడాశాఖ అధికారి రమేష్ కుమార్ పాడి తదితరులు విజేత జట్టుకు ట్రోఫీని అందించారు.

దివ్యాంగుల జీవితాల్లో.. ఉషస్సులు!


కృత్రిమ అవయవాలను అమర్చుతున్న దృశ్యం

- వైకల్యాన్ని జయించి దివ్యాంగుల సేవలో తరిస్తున్న ఉషారాణి
- ఇప్పటి వరకు 75 మందికి కృత్రిమ అవయవాలు
- భర్త సహకారంతో సేవా కార్యక్రమాలు


గురుదేవ్ చారిటబుల్ ట్రస్టుకు తీసుకెళ్లి దివ్యాంగునికి కాలు అమర్చుతూ..

శ్రీకాకుళం కల్చరల్ : అంగ వైకల్యం మనిషిని ఎంతగా కుంగదీస్తుందో, ఆ బాధ ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించిన ఆమె.. తనలాంటి వారి బాధలను కొంత అయినా తగ్గించాలని నిర్ణయించుకున్నారు. భర్త కష్టపడి సంపాదిస్తున్న సొమ్ములో కొంతమేర పొదుపు చేస్తూ ఆ మొత్తాన్ని దివ్యాంగుల సేవకు వినియోగిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆ సేవకురాలే అరసవల్లికి చెందిన కల్లేపల్లి ఉషారాణి. భర్త జిల్లా పరిషత్‌లో చిరుద్యోగం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు. ఉషారాణికి చిన్నతనంలో పోలియో సోకడంతో కాలు పనిచేయక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైకల్యాన్ని పోగొట్టేందుకు తన తండ్రి అనేక ప్రయత్నాలు చేశారు. బరంపూర్‌లో రెండు ఆపరేషన్లు చేయించారు. కొంతవరకు నయమైనా పూర్తి స్థాయిలో అందరిలా నడవాలనే ప్రయత్నంలో కాలికి కేలిఫైర్‌ను ఏర్పాటు చేసుకొని నడవడం ప్రారంభించారు.

తనబాటలోనే పిల్లలు..

తన బాటలోనే తన పిల్లలు నడవాలని వారిని కూడా అందుకు సంబంధించిన కోర్సులలో చేర్పించి చదివిస్తున్నారు. ఉషారాణి కుమార్తె దుర్గప్రియ, కుమారుడు సాయి నిశ్చల్ ఫిజియోథెరపీ కోర్సులలో చేర్పించారు. వారిని అందులో నిష్ణాతులను చేసి దివ్యాంగుల సేవ కోసం ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో తన భర్త కూడా ఎంతగానో సహకారం అందిస్తున్నారు.

భర్త సహకారంతో..

తనలా ఇంకెవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దివ్యాంగులకు తన వంతు సేవ చేయాలని ఉషారాణి నిర్ణయించుకున్నారు. భర్త శ్రీరామమూర్తి సహకారంతో తమకు వచ్చిన సంపాదన లోంచి కొంత సొమ్మును పొదుపు చేసుకుంటూ కాలు, చెయ్యి, కళ్లు లేనివారికి సాయం చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఎవరికైనా కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేయాలంటే విజయనగరం జిల్లాలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉషారాణి తన బృందంతో కలిసి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పర్యటించి అవయవాలు అవసరమైన వారిని గుర్తిస్తున్నారు. వారిని సొంత ఖర్చుతో ట్రస్టు వద్దకు తీసుకెళ్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి అవయవాలు చేయిస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చునంతా తానే భరిస్తున్నారు. ఇటీవల ఉషారాణి చారిటబుల్ ట్రస్ట్, లైన్స్‌క్లబ్ హర్షవల్లి సహకారంతో కృత్రిమ అవయవాల మంజూరుకు క్యాంపు ఏర్పాటు చేశారు. ఒకేసారి 50 మందికి కృత్రిమ అవయవాలను అందించారు.

వారి సంతోషమే మా ఆనందం



దివ్యాంగుల కళ్లలో నుంచి వచ్చే సంతోషమే మాకు ఆనందం. దీనంతటికీ కారణం మా నాన్నే. ఆయన కూడా దివ్యాంగుల కోసమే కాకుండా అనాథలకు ఎంతగానో సాయం అందించేవారు. మా సంపాదనలో వచ్చే పది రూపాయలలో రూ.4 పొదుపు చేస్తూ ఈ సేవ చేస్తున్నాను.

– కల్లేపల్లి ఉషారాణి, గృహిణి, అరసవల్లి

క్రికెట్ మైదానంలో గంజాయి ఒప్పందాలు

- ఇద్దరు ఒడిశా యువకులను అరెస్టు చేసిన కాశీబుగ్గ పోలీసులు
- 10 కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన ఒడిశా యువకులు వీరే..


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కాశీబుగ్గ: క్రికెట్ గ్రౌండ్‌లో ఆ యువకులకు పరిచయం ఏర్పడింది. ఓవైపు ఆడుతూనే.. మరో వైపు అక్రమంగా డబ్బులు ఎలా సంపాదించాలో ఆలోచించారు. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా చేయాలని నిర్ణయించుకున్నారు. చివరకు పోలీసులకు దొరికిపోయి కటకటాలపాలయ్యారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా తండిగుడ, తాళ్లబంద గ్రామాలకు చెందిన తపాన్ బెబారత, మాననిత్ సింగ్ ఇరుగు పొరుగు గ్రామాల యువకులు. తరచూ క్రికెట్ గ్రౌండ్‌లో కలుసుకునేవారు. పది కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తే రూ.10 వేలు వస్తుందని ఒప్పందం కుదరడంతో ఇద్దరూ పలాసలోని రైలు నిలయానికి వచ్చారు. బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 10.39 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మూడు వాహనాలు ఢీ

- ముగ్గురికి గాయాలు
- దన్నానపేట హైవేపై ఘటన


ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ


బోల్తా పడిన ట్రాక్టర్

రణస్థలం : మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీ దన్నానపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం మూడు వాహనాలు ఢీకొట్టుకున్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 8.50 గంటల సమయంలో విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న లారీ ముందు వెళుతున్న ధాన్యం నూర్పిడి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఆ వాహనం ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ రెడ్డి శ్రీనుకు స్వల్ప గాయాలు కావడంతో రణస్థలం సీహెచ్‌సీలో చేర్పించారు. ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు యు.రామకృష్ణ, యు.విజయగౌరీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని జె.ఆర్.పురం పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.చిరంజీవి చెప్పారు.

క్లుప్తంగా

ప్రవర్తన మారకుంటే జైలుకే

• రౌడీషీటర్లకు ఎస్పీ హెచ్చరిక



పాత నేరస్తులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు

విజయనగరం క్రైమ్: జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఎస్పీ వకుల్ జిందల్ ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో తమ తమ స్టేషన్‌ల పరిధిలో ఉన్న పాత నేరస్తులను శనివారం పిలిపించి క్లాస్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో సంబంధిత స్టేషన్ల ఎస్సైలు హిస్టరీ,రౌడీషీట్లు కలిగిన నేరస్తులను స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లాలోని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, చీపురుపల్లి, గరివిడి, గజపతినగరం, ఎస్.కోట, వల్లంపూడి ఇలా 34 స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్ల ప్రవర్తన, వారు రోజువారీ నిర్వర్తించే పనులపై ఓ కన్నేసి ఉంచాలని ఎస్పీ వకుల్ జిందల్ సిబ్బందికి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. రౌడీలు మళ్లీ దురుసుగా నేరాలకు పాల్పడే విధంగా ఉంటే ప్రత్యేకంగా వారిపై నిఘా తీవ్రతరం చేయాలని సూచించారు.

25 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తెర్లాం: అనధికారికంగా బెల్ట్ దుకాణం నడుపుతున్న వ్యక్తి వద్ద 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెర్లాం ఎస్సై సాగర్‌బాబు శనివారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై మాట్లాడుతూ మండలంలోని నందబలగ గ్రామంలో బమ్మిడి నారాయణరావు అనే వ్యక్తి అనధికారికంగా బెల్ట్ దుకాణం నడుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి దాడి చేశామన్నారు. ఈ దాడిలో 25 మద్యం సీసాలతో పట్టుబడిన నారాయణరావును అరెస్ట్ చేసి బొబ్బిలి కోర్టుకు తరలించామని చెప్పారు.

సమగ్ర శిక్షలో సెక్టోరల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

21 నుంచి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖలోని సమగ్ర శిక్ష విభాగంలో ఖాళీగా ఉన్న సెక్టోరల్ పోస్టుల భర్తీకి కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఉత్తర్వుల మేరకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేశామని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటస్టికల్ అధికారి, అసిస్టెంట్ ఏఎంఓ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత పోస్టులకు అర్హతగల ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల నుంచి ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నామని తెలిపారు. దరఖాస్తు తదితర వివరాలను 'విజయనగరం.ఎన్ఐసీ.ఐఎన్' వెబ్ సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ సందర్శించిన ఈడీ



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఈడీ బ్రహ్మానంద రెడ్డి

గజపతినగరం : ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో అన్ని మౌలికవసతులు కల్పించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల రాకపోకల్లో ఆర్టీసీ కాంప్లెక్స్ వచ్చి వెళ్లే ఏర్పాట్లు చేశామన్నారు. ఏవైనా బస్సులు విజయనగరం నుంచి గజపతినగరం మీదుగా సాలూరు వెళ్లేవి, సాలూరు నుంచి గజపతినగరం మీదుగా విజయనగరం వెళ్లేవి గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్(డిపోకు)కు రాకుండా డైరెక్ట్‌గా వెళ్లిపోయినట్లయితే తమకు సమాచారం ఇస్తే సంబంధిత డ్రైవర్‌లు, కండక్టర్లపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.అనంతరం కాంప్లెక్స్‌లో తాగునీరు, ప్రయాణికుల మరుగుదొడ్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీడీఓ అప్పలనాయుడు, డీఎం శ్రీనివాసరావు, ఆర్టీసీ కాంప్లెక్స్ కంట్రోలర్ ఆరిక తోట జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

విజయనగరం రూరల్: పిల్లలకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ప్రసన్న అన్నారు. మండలంలోని కోరుకొండ సెక్టార్ పరిధి బియ్యాలపేటలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానికంగా చవకగా దొరికే పౌష్టికాహార పదార్థాలపై వివరించారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఐ. కనకమహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు టాటా..?

• ఉన్నత పాఠశాలల్లో ఒకటోతరగతి నుంచే అడ్మిషన్లు
• ఎక్కడైనా చేరవచ్చంటూ అంటూ జీఓ జారీ
• జిల్లావ్యాప్తంగా 287 ప్రాథమిక పాఠశాలల ఎత్తివేతకు కసరత్తు

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేయనున్న నూతన విద్యావిధానంతో డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు కలగానే మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. అలాగే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉన్నత పాఠశాలల్లో విలీనం జరిగితే చాలా గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఎత్తివేస్తారు. ఫలితంగా ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న, భవిష్యత్‌లో ఖాళీ అవనున్న ఎస్జీటీ పోస్టుల భర్తీ పూర్తిగా నిలిచిపోనుంది. ఇప్పటికే మెగా డీఎస్సీ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ఏడాది కావస్తున్నా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మెగా పోస్టుల సంఖ్య గత ప్రభుత్వం ఇచ్చిన పోస్టుల కంటే ఎక్కువగా కనిపించడంలేదు. ఉన్న పోస్టులే భర్తీచేయలేని పరిస్థితుల్లో ఖాళీగా ఉన్న పోస్టులు కొత్త విద్యావిధానంతో అటకెక్కితే ఎలా భర్తీచేస్తుందోనని ఉపాధ్యాయులు, నిరుద్యోగులు అయోమయంలో పడ్డారు.



ఎత్తివేతకు సిద్ధంగా రాజాం పట్టణంలోని దోలంట ప్రాథమిక పాఠశాల

రాజాం: ప్రభుత్వ విద్య బలోపేతం మాట పక్కన పెడితే ఉన్న విద్య అటకెక్కేలా కనిపిస్తోంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా గడిచిన రెండేళ్ల క్రితం నుంచే కేంద్ర మానవవనరులశాఖ ప్రభుత్వ ప్రాథమిక విద్యను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు ఆర్‌టీఈని ప్రయోగించింది. అప్పటి రాష్ట్రప్రభుత్వం ఈ విద్యావిధానాన్ని అడ్డుకోవడంతో పాటు ప్రాభుత్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల వద్ద ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు కృషిచేసింది. మరోవైపు ఎన్ఈపీని గౌరవిస్తూ 3 నుంచి 5వతరగతి వరకూ కొన్నిగ్రామాల్లోని (ఉన్నత పాఠశాల నుంచి 500 మీటర్లు లోపు ఉన్న పాఠశాలలకు చెందిన) తరగతులను గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారంతో విలీనం చేసేందుకు అవకాశం కల్పించింది. అయితే ఈ విధానాన్ని చాలా గ్రామాల్లో వ్యతిరేకించడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు చాలాచోట్ల యథావిధిగా కొనసాగాయి. ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారైంది. రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కేంద్రానికి వత్తాసు పలుకుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు సిద్ధమైంది. ఈమేరకు అన్ని మండల మానవ వనరుల కేంద్రాలకు, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు తమ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి 1వ తరగతి నుంచే చేరికలు చేసుకోవచ్చునని ఆదేశాలు జారీచేసింది.

287 పాఠశాలల వరకూ విలీనం

కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికే చాలామంది ఉద్యోగులు, ప్రధానంగా ఉపాధ్యాయుల్లో ఈ విధానం ఆందోళన కలిగించింది. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి బాహాటంగానే మద్దతు ఇవ్వడంతో ఇప్పుడు కూటమి ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించలేక, కొనసాగించలేక సతమతమవుతున్నారు. ఇప్పటికే ఈ సర్క్యులర్లు అందుకున్న పాఠశాలలు తమ పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల ప్రారంభానికి కసరత్తు చేసుకుంటున్నారు. ఆయా పాఠశాలల్లో ఇదివరకే ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులు ఉండడంతో విద్యార్థుల సంఖ్యను పెంచుకునే ప్రయత్నం గుట్టుగా చేస్తున్నారు. ఈ కొత్త జీఓ బయటకు వస్తే చాలామంది నిరుద్యోగుల్లో వ్యతిరేకత అధికమవుతుందనే ఉద్దేశంతో విద్యాశాఖ గుప్‌చుప్‌గా తంతు నడిపిస్తోంది. ఈ విషయం తెలిసి నిలదీస్తున్న పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఒకటో తరగతి అడ్మిషన్లు ఇస్తున్నామని, విద్యార్థులకు ఎక్కడ నచ్చితే అక్కడ చేర్పించుకోవచ్చునని నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1317 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 168 ప్రాథమికోన్నత పాఠశాలలు, 232 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలల పరిధిలో ఒక్కో గ్రామంలో గతంలో విద్యార్థులు, జనాభా సంఖ్య ఆధారంగా ఒకటి నుంచి మూడేసి ప్రాథమిక పాఠశాలలు ఉండేవి. ఇప్పుడు ఇందులోని 287కిపైగా ప్రాథమిక పాఠశాలలు దగ్గర్లోని ఉన్నత పాఠశాలల్లో విలీనం కానున్నాయి.

వింత కొర్రీలు

మరోవైపు ప్రాథమిక పాఠశాలల్లో వంటలు వండుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఖ్య కుదింపు ప్రారంభమైంది. పూర్తిగా మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకుల విధానం ప్రాథమిక పాఠశాలల్లో అటకెక్కే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఉన్నత పాఠశాలల్లో చేరిన 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు మళ్లీ వెనక్కు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. అయితే ఇక్కడ ప్రభుత్వం కొత్త కొర్రీ పెడుతోంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో చేరిన విద్యార్థులు మళ్లీ వెనక్కు వెళ్లాలంటే కుదరదని కచ్చితంగా చెబుతుంది. అలా తప్పని పరిస్థితుల్లో వెళ్లాలంటే దగ్గరలో 45 మంది విద్యార్థులు దాటి ఉన్న ప్రాథమిక పాఠశాలలకు, మోడల్ స్కూల్‌కు వెళ్లాలని చెబుతున్నారు. ఫలితంగా విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో మానేసి, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు.

పాఠశాల ఎత్తివేసే పరిస్థితి

మా గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. ఉన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలు చేస్తున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థులు ఉన్నత పాఠశాలల వైపు వెళ్లిపోయే పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇక్కడ ఎత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. కనీసం విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశం, గ్రామ ప్రజా ప్రతినిధులతో ఆలోచన చేయలేదు. గురుగుబిల్లి స్వామినాయుడు, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వాల్తేరు

మంచి విధానమే

అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక విద్యకు అడ్మిషన్లు ఇవ్వడంలేదు. గతంలో 3 నుంచి 5వ తరగతివరకూ విలీనమైన ఉన్నత పాఠశాలల్లోనే ప్రాథమిక విద్యకు అవకాశం కల్పించాం. ఈ విధానంతో ఆయా ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ ప్రాథమిక పాఠశాల అక్కడ కొనసాగాలంటే కనీసం 45 మంది విద్యార్థులు దాటి ఉండాలి.

యు.మాణిక్యంనాయుడు, డీఈఓ, విజయనగరం.

ప్రతిభకు సత్కారం



ఇంటర్మీడియట్‌లో ఉత్తమప్రతిభ కనబరిచిన తనూజను సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు



తాడ్డితనూజను సన్మానిస్తున్న మాజీ ఎంపీ బొత్సఝాన్సీలక్ష్మి, తదితరులు

మెరకముడిదాం: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సరం ఫలితాల్లో గర్భాం ఏపీ మోడల్‌స్కూల్‌లో చదివిన అదే గ్రామానికి చెందిన తాడ్డితనూజ 987/1000 (బైపీసీ) మార్కులు సాధించి రాష్ట్రంలో ఉన్న ఏపీ మోడల్‌స్కూల్స్ అన్నింటిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు గర్భాం గ్రామంలో తాడ్డితనూజను దుశ్శాలువతో శనివారం ఘనంగా సత్కరించారు. ఒకజత దుస్తులు, షీల్డ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ తనూజతో మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా ఉన్నతచదువులు పూర్తిచేసి మంచి కీర్తిప్రతిష్టలను తీసుకురావాలంటూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌వీ రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డి వేణుగోపాల్‌రావు, కోట్లవిశ్వేశ్వరరావు, కేఎస్ఆర్‌కే ప్రసాద్, బూర్లెనరేష్‌కుమార్, పప్పలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచాలి

ఉన్నతచదువుల్లోనూ ఉత్తమ ప్రతిభను కనబరచాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి తాడ్డితనూజకు సూచించారు. ఇటీవల ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సరంలో ఉత్తమప్రతిభ కనబరిచిన తనూజను ఆమె దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ భార్య శ్రీదేవి, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, ఎస్‌వీ రమణరాజు, తాడ్డివేణుగోపాల్‌రావు, కోట్లవిశ్వేశ్వరరావు, కేఎస్ఆర్‌కే,ప్రసాద్, బూర్లెనరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళి పీఏసీఎస్‌లో దర్యాప్తు

తెర్లాం: మండలంలోని పెరుమాళి పీఏసీఎస్‌లో అవకతవకలు జరిగాయని శివరామరాజు అనే వ్యక్తి ఇటీవల కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం దర్యాప్తు నిర్వహించారు. బొబ్బిలి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధికారి చల్లా పద్మజ పీఏసీఎస్‌కు వచ్చి ఫిర్యాదుదారు, పీఏసీఎస్ అధికారులు, కమిటీ సభ్యుల సమక్షంలో దర్యాప్తు చేశారు. పీఏసీఎస్‌లో రైతులకు తెలియకుండా రుణాలు మంజూరు చేస్తున్నారని, నచ్చిన వారిని ఎటువంటి జీవోలు లేకుండా ఉద్యోగులుగా నియమించుకుని వేలాది రూపాయలు జీతాలుగా తీసుకుంటున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. పెరుమాళి పీఏసీఎస్ పరిధిలో డీసీసీబీ నిధులతో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారని, ఆ బంక్‌లో కూడా అక్రమాలు జరుగుతున్నాయని కొరగంజి అశోక్ దర్యాప్తు అధికారి వద్ద తెలిపారు. దీనిపై దర్యాప్తు అధికారి పద్మజ మాట్లాడుతూ పెరుమాళి పీఏసీఎస్‌లో జరిగిన దర్యాప్తులో ఫిర్యాదుదారులు తెలిపిన వివరాలు, సభ్యులు లేవనెత్తిన అంశాలను, సూపర్‌వైజర్, మేనేజర్ దర్యాప్తుకు హాజరుకాని విషయంపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తానని చెప్పారు. దర్యాప్తులో పీఏసీఎస్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



పీఏసీఎస్‌లో దర్యాప్తు నిర్వహిస్తున్న బొబ్బిలి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధికారి పద్మజ

22న సీనియర్స్ క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం: ఈనెల 22న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషుల సీనియర్స్ విభాగంలో జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వీడీసీఏ కార్యదర్శి పి.సీతారామరాజు (రాంబాబు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7:30 గంటలకు జిల్లా కేంద్రంలోని సర్ విజ్జి క్రికెట్ మైదానంలో నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు తెలుపు డ్రెస్, సొంత కిట్‌తో హాజరుకావాలని కోరారు. అలాగే ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులు భర్తీ చేయాలి

• డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్
• జిల్లా మంత్రికి వినతిపత్రం అందజేత

విజయనగరం గంటస్తంభం: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే ఇచ్చి 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్, డీఎస్సీ అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి. కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన పోస్టులను రద్దుచేసి సూపర్ సిక్స్‌లో భాగంగా అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో మొదటి సంతకం పెట్టి మొదటికే డీఎస్సీ అభ్యర్థులని మోసం చేశారని ఆరోపించారు. పది నెలలు గడిచినా మొదటి సంతకాన్ని అమలు చేయలేదని వాపోయారు. వారంలో మెగా డీఎస్సీ అని ముఖ్యమంత్రి, త్వరలోనే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికి పదిసార్లు ప్రకటనలు చేసి నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేశారన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ మొదటి వారానికి నోటిఫికేషన్ ఇస్తామని జూన్ నాటికి భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నా రు. జిల్లాలో దాదాపు 20 వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. గత ఏడేళ్లుగా ఒక్క నోటిఫికేషన్ లేకపోవడంతో ఒక వైపు కుటుంబం నుంచి ఒత్తిడి మరోవైపు అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డీఎస్సీలో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మురళి, నరేష్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, అభ్యర్థులు

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: అభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబర్ 15వ తేదీ నాటికి ఇళ్లు నిర్మించుకున్న వారందరూ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో అర్హులైన వారి పేరిట క్రమబద్ధీకరిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సెలవు రోజు కూడా పన్నుల వసూలు

విజయనగరం: మున్సిపల్ శాఖ ఆదేశాల ప్రకారం ఆదివారం సెలవు రోజైనప్పటికీ.. ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను వసూళ్ల ప్రక్రియ కొనసాగుతుందని కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరం మొత్తం పన్నును ఒకేసారి చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ.. అలాగే 2024 - 25 ఆర్థిక సంవత్సరపు బకాయి పన్ను ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సౌకర్యాలు కల్పించాల్సిందే..



సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు, తదితరులు

నెల్లిమర్ల: సినిమా ప్రేక్షకులకు థియేటర్ల యజమానులు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ పి. సుదర్శనరావు అన్నారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది నగరపంచాయతీలోని సినిమా థియేటర్‌ను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి. వేణుగోపాల్, వీఆర్ఓ గోవింద్, వీఆర్ఏ సూరి, తదితరులు పాల్గొన్నారు.

27న సాహిత్య సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య 548 సభలో భాగంగా వాగ్గేయకారుల సామాజిక దృక్పథంపై ఈ నెల 27న స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత సంగీత కళాకారిణి బురిడి అనురాధా పరశురామ్ సభాధ్యక్షత వహిస్తారన్నారు. ప్రధానవక్తగా మధురగాయని డాక్టర్ ఎం.ఆముక్తమాల్యద సుష్మ, సమ్మానకర్తగా డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య పాల్గొంటారన్నారు. సాహితీవేత్తలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఎవరి బాగు కోసం..?



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ కీర్తి, డ్వామా పీడీ శారదాదేవి తదితరులు



చెరువులో రోడ్డును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ, ఈఈలు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామం సమీపంలో గల నరసరాజు చెరువులో అక్రమంగా 40 అడుగుల రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ ప్రధాన నాయకుడు ఒకరు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారని గ్రామస్తులు, రైతులు వాపోతున్నారు. సర్వే నంబర్ 142లో సుమారు 45 ఎకరాల్లో నరసరాజు చెరువు ఉంది. ఈ చెరువు కింద సుమారు 2వేల ఎకరాల సాగుభూమి ఉంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధుల నుంచి సుమారు రూ.50లక్షల అంచనా వ్యయంతో 40 అడుగుల వెడల్పుతో సుమారు 12వందల మీటర్లు రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు పనులు నియోజకవర్గానికి చెందిన ప్రధాన టీడీపీ నాయకుడు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

తీర్మానం ఒక చోట..నిర్మాణం మరో చోట

ఈ రోడ్డును కంటకాపల్లి పంచాయతీ నుంచి కొత్తవలస రోడ్డు మీదుగా దత్తి, దన్నినపేట గ్రామాలకు వేయాలని తీర్మానం చేశారు. అయితే తీర్మానం చేసిన ప్రాంతంలో ఎప్పుడో 2009వ సంవత్సరంలోనే నాబార్డ్ నిధులతో బ్లాక్‌టాప్ రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న రోడ్డు కేవలం చెంతనే గల ఒక ప్రైవేట్ కంపెనీకి తప్ప ఎవరికీ ఉపయోగం లేదు. కంపెనీ కోసం సాగునీటి చెరువులో నుంచి రోడ్డు వేస్తే తమ పంట పొలాలకు నీరు అందేదెలా అంటూ రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డు పనులపై కలెక్టర్‌కు గ్రామస్తులు, రైతులతో పాటు టీడీపీకి చెందిన ఒక వర్గం నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ దాట్ల కీర్తి, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఎస్.శారదదేవి, పంచాయతీ రాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్,ఈఈ రత్న కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ స్వర్ణకుమార్,ఈఈ ఎంవీ రమణలు శనివారం పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా రోడ్డు పనులను, రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ తీర్మానాల కాపీలను తీసుకున్నారు. అలాగే స్థానిక ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్, నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులను అడిగి వివరాలు సేకరించారు. ఈ నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ కీర్తి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఎంపీడీఓ ఎస్.రమణయ్య, పంచాయతీ రాజ్ డీఈ స్వామినాయుడు, ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీచరణ్ తదితర మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అమ్మ భాషతో ఆత్మ విశ్వాసం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

విజయనగరం: జీవితంలో ఎదిగేందుకు ఆంగ్ల భాష దోహదపడినా అమ్మ భాషతోనే ఆత్మ విశ్వాసం సాధ్యమని విజయనగరం ఫోర్ట్ క్యాంపస్‌లో గల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ బీఎస్‌ఏ రాజు అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాషపై పట్టుసాధిస్తే ఇతర భాషలను సులువుగా నేర్చుకోవచ్చన్నారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల గురుప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు పుస్తకాలు, పతకాలను ప్రదానం చేశారు.కార్యక్రమంలో డిమ్స్ కంప్యూటర్స్ రాజు, సమితి ఉపాధ్యక్షుడు కాగుపాటి నారాయణమూర్తి, సలహాదారు సుభద్రాదేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కేఎస్ఏ మూర్తి, కె. హరికృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

• ఏడుగురిని గుర్తించి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బొబ్బిలి: ప్రశాంతమైన బొబ్బిలిలో యువత గంజాయికి అలవాటు పడ్డారు. ఈ విషయమై పోలీసులు పెట్టిన నిఘాలో కీలక ఆధారాలు బయటపడ్డాయి. దీంతో ఆ దిశగా విచారణచేసిన పోలీసులకు ముగ్గురు బీటెక్ విద్యార్థులు పట్టుబడినట్లు తెలిసింది. వారు ఇతర జిల్లాల నుంచి వచ్చి ఇక్కడి కాలేజీలో చదువుకుంటున్న వారుగా గుర్తించారు. పోలీసులు జరుపుతున్న విచారణలో మొత్తం ఏడుగురిని ప్రాథమికంగా గుర్తించి విక్రేతలు, కొనుగోలుదారులే కాకుండా సాగు చేస్తున్న వారి వివరాలు కూడా సేకరించినట్లు సమాచారం. మరో ముఖ్యమైన విషయమేమంటే పోలీసులు గుర్తించిన నిందితుల్లో సుమారు 70ఏళ్ల వృద్ధుడు కూడా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం గంజాయిని వినియోగిస్తూ, విక్రయిస్తున్న వారిలో ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదు చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మక్కువ మండలంలోని కంచేడువలస, కొయ్యాన పేట గ్రామాలకు చెందిన లక్ష్మణరావు, కాంతారావులు బొబ్బిలి పట్టణానికి చెందిన యువకులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయమై ఎస్సై ఆర్ రమేష్‌ను వివరణ కోరగా పట్టణంలో విక్రయిస్తూ గంజాయి కలిగి ఉన్న ముగ్గురు బీటెక్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారిపై బుధవారమే కేసు నమోదు చేశామని, ప్రస్తుతం విచారణ జరుగుతోందని పూర్తిస్థాయిలో నిందితులను అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలో పూర్తివివరాలను వెల్లడిస్తామన్నారు.

వన్‌టౌన్ పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి నిందితులు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను విజయనగరం వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన సమాచారం మేరకు..నగరంలోని గూడ్స్ షెడ్‌వద్ద వన్‌టౌన్ ఎస్సై ప్రసన్నకుమార్ వెహికల్స్ తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు తాను డ్రైవ్ చేస్తున్న బైక్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో అనుమానం వచ్చి మ్యాన్ ప్యాక్ ద్వారా యువకుడితో పాటు బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తిని పట్టుకుని విచారణ చేసి రెండు కేజీల గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. నగరంలోని శాంతినగర్‌కు చెందిన వాసుపల్లి విజయ్(19)ను మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీ చేసి స్కూటీని, వారు తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.



విజయనగరం క్రైమ్: గూడ్స్ షెడ్ వద్ద గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ ఎస్సై ప్రసన్నకుమార్, బృందం